సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం । 24 । మే । 2025



పుష్కర 'కష్టాలు'

కాళేశ్వరంలో సరస్వతినది పుష్కరాలకు వస్తున్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. శుక్రవారం సుమారు ఏడు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. - 10లో▸



ట్రాలీ అడుగును అరలుగా మార్చి..

ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో నిషేధిత ఎండు గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మార్కెట్‌లోకి విజయ డెయిరీ కొత్త ప్యాకింగ్



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ పాలు, పెరుగు ఉత్పత్తులను నేటి (శనివారం) నుంచి కొత్త ప్యాకింగ్‌లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వరంగల్ యూనిట్ డీడీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ప్యాకింగ్ ఉత్పత్తులను ములుగురోడ్ సమీపంలోని విజయ డెయిరీ ఆవరణలో ఉదయం 11గంటలకు డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. 150 ఎంఎల్ టోన్డ్ మిల్క్, 120, 400 టీఎం పెరుగు ప్యాకెట్లతోపాటు 900 గ్రాములు, 1 కేజీ, 5కేజీ, 10 కేజీ డీటీఎం పెరుగు బకెట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.

ఎంబీఏ పరీక్షల పరిశీలన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ వి.రామచంద్రం సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి, డాక్టర్ ప్రగతి ఉన్నారు.

బాలికను దత్తత తీసుకున్న అమెరికా దంపతులు



హన్మకొండ అర్బన్: జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనుబంధ శిశు గృహ, బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న పదేళ్ల బాలికను అమెరికా దేశానికి చెందిన దంపతులకు ఇంటర్ కంట్రీ అడాప్షన్ ఇచ్చినట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి తెలిపారు. గతంలోనే ఈ దంపతులు అంతర్రాష్ట దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నట్లు.. పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం వారికి సీనియార్టీ ప్రకారం నిబంధనల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో బాలికను దత్తత అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతృత్వం ఒక వరమని అందుకు చట్టబద్ధమైన దత్తత ప్రధాన మార్గమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సందసాని రాజేంద్రప్రసాద్, బాలరక్షా భవన్ కో–ఆర్డినేటర్ సీహెచ్.అవంతి, సూపరింటెండెంట్ కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక, దత్తత కేంద్రం సోషల్ వర్కర్ సంగి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు..

విద్యారణ్యపురి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఉదయం నిర్వహించిన ఇంటర్ ప్రథమ ఫస్టియర్ పరీక్షలకు 2,127 మంది విద్యార్థులకుగాను 1,851మంది (87శాతం) హాజరుకాగా.. 276 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 152 మందికిగాను 75 మంది హాజరుకాగా, 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

వరంగల్ జిల్లాలో 91మంది గైర్హాజరు..

వరంగల్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 559 మందికి 499 మంది హాజరుకాగా, 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. సెకండియర్ పరీక్షల్లో 131 మందికి గాను 110 మంది హాజరుకాగా, 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.



పుష్కరిణికి మొక్కుతున్న యువతులు



సైకత లింగానికి పూజలు చేస్తున్న మహిళ

జీవ నది.. ఉప్పొంగిన మది

నదిని చూసిన మది ఉప్పొంగింది.. స్నానమాచరించాక కష్టాల గుండె తేలికయ్యింది.. చల్లని తల్లికి నమస్కరించాక భయం పటాపంచలైంది.. సైకత లింగాన్ని పూజించాక అభయం అందినట్లయ్యింది. అని కాళేశ్వరానికి వచ్చినవారు భక్తి పారవశ్యంలో మునిగిపోయి కనిపించారు. 'సల్లంగ సూడు సరస్వతమ్మా' అంటూ నీటిలో దీపాలు వదిలారు. గోదావరి మాతకు చీరసారె సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. శుక్రవారం కాళేశ్వరం భక్తజన సంద్రమైంది. సుమారు లక్షమందికి పైగా భక్తులు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

- వివరాలు, ఫొటోలు 10లో▸



జన సందోహంగా మారిన నది పరిసరాలు

బదిలీల కుదుపు...

కొద్దిరోజులుగా పోలీస్‌శాఖలో హాట్‌టాపిక్

- ఇప్పటికే 8 మంది డీఎస్పీ/ఏసీపీల బదిలీ
- ముగ్గురు అడిషనల్ ఎస్పీలకు పోస్టింగ్
- త్వరలో మరికొందరు డీఎస్పీలు.. సీఐలకు కూడా స్థానచలనం?
- పోస్టింగ్‌లకు హామీలు పొందిన ఎస్‌హెచ్‌ఓలు
- సెలవులో పోలీస్ కమిషనర్.. వచ్చాక ప్రక్రియ మొదలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

పోలీస్‌శాఖలో బదిలీల కుదుపు మొదలైంది. చాలా రోజుల తర్వాత ఉమ్మడి వరంగల్‌లో పలువురు డీఎస్పీ/ఏసీపీలకు స్థానచలనం కలిగింది. నార్త్‌జోన్–1 పరిధిలో పలువురు ఎస్‌హెచ్‌ఓలు బదిలీ కాగా, అడిషనల్ ఎస్పీలు కూడా మారారు. పది రోజుల వ్యవధిలో రేంజ్ పరిధిలో ఐదారు ఉత్తర్వుల ద్వారా 29 మంది ఎస్‌హెచ్‌ఓల బదిలీలు అయ్యాయి. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్‌హెచ్‌ఓలు మారారు. ఈనేపథ్యంలో త్వరలోనే మరో ఇద్దరు డీఎస్పీలు, భారీ సంఖ్యలో సీఐ/ఎస్‌హెచ్‌ఓల ట్రాన్స్‌ఫర్లు ఉంటాయన్న ప్రచారం పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఒక్కసారిగా బదిలీల కలకలం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన డీఎస్పీ/ఏసీపీల మూకుమ్మడి బదిలీలు కలకలంగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 77మంది ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేయగా.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురికి స్థానచలనం కలిగింది. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన వి.కిరణ్‌కుమార్ డీజీపీ ఆఫీస్‌కు బదిలీ కాగా, ఆ స్థానంలో ఖమ్మం సీసీఆర్బీ ఏసీపీగా పనిచేసిన పున్నం రవీందర్ రెడ్డిని నియమించారు. కాజీపేట ఏసీపీ తిరుమల్ హైదరాబాద్ 'హైడ్రా' స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులు కాగా, సైబర్ సెక్యూరిటీ విభాగం డీఎస్పీగా ఉన్న పింగిళి ప్రశాంత్‌రెడ్డిని తీసుకొచ్చారు. మామునూరు ఏసీపీ బి.తిరుపతి డీజీపీ కార్యాలయానికి బదిలీ చేసి ఆయన స్థానంలో ఖమ్మం ఎస్బీ ఏసీపీగా పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్‌ను, రాచకొండ 'షీ'టీమ్ ఏసీపీగా పని చేస్తున్న పి.నర్సింహారావు హనుమకొండ ఏసీపీగా, హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. అదేవిధంగా సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న పి.సదయ్య వరంగల్ సీసీఎస్ ఏసీపీగా నియమించగా.. త్వరలో మరో ఇద్దరు నుంచి ముగ్గురు డీఎస్పీలకు స్థానచలనం ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఖమ్మం అడిషనల్ డీసీపీగా ఉన్న ఎ.నరేశ్‌కుమార్ భూపాలపల్లి ఏఎస్పీగా నియమించిన డీజీపీ, భూపాలపల్లి ఏఎస్పీగా ఉన్న బోనాల కిషన్ వరంగల్ ఏఎస్పీగా, కొమురంభీం ఆసిఫాబాద్ ఏఎస్పీగా ఉన్న ఆర్.ప్రభాకర్‌రావును వరంగల్ కమిషనరేట్‌కు అదనపు డీసీపీగా నియమించారు.

త్వరలోనే ఎస్‌హెచ్‌ఓల వంతు.. ఇప్పటికే ఠాణాల్లో ఖర్చీఫ్‌లు..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో పలువురికి త్వరలోనే స్థానచలనం కలగనుంది. వాస్తవానికి ఇరవై రోజుల కిందటే జరుగుతాయన్న ప్రచారం జరిగింది. అయితే ఏసీపీ, డీఎస్పీల బదిలీ తర్వాత ఎస్‌హెచ్‌ఓలపై కసరత్తు జరుగుతోంది. ఈనేపథ్యంలో అప్రమత్తమైన పలువురు సీఐలు ఎస్‌హెచ్‌ఓలుగా ఠాణాల్లో ఖర్చీఫ్‌లు వేసుకుని పోస్టింగ్‌లు పదిలం చేసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పని చేస్తున్న వారు గ్రేటర్ వరంగల్ ఠాణాలపై గురి పెట్టారన్న ప్రచారం ఉంది. ఇదిలా ఉండగా మిల్స్ కాలనీ పీఎస్‌లో సస్పెండైన ఎస్‌హెచ్‌ఓ వెంకటరత్నం స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది. దీంతో పలువురు ఎస్‌హెచ్‌ఓలను బదిలీ చేస్తారన్న చర్చ పోలీసువర్గాల్లో సాగుతోంది. హనుమకొండ, హసన్‌పర్తి, సుబేదారి, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, ఏనుమాములలతో పాటు కమిషనరేట్ పరిధిలోని పన్నెండు ఠాణాల్లో ఎస్‌హెచ్‌ఓల మార్పు ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ ఠాణాల్లో పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులనుంచి హామీలు పొందిన ఇన్‌స్పెక్టర్ల పేర్లు కూడా ప్రచారం జరుగుతున్నాయి. సెలవులో వెళ్లిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తిరిగి విధుల్లో చేరాక ఈ ప్రక్రియ జరుగుతుందని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

కమిషనరేట్‌పై పట్టు బిగిస్తున్న సీపీ..

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా మార్చి 10న బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్‌సింగ్.. కమిషనరేట్‌పై పట్టు బిగించారు. సీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన నెలరోజుల్లోపే సుమారు 18 పోలీస్‌స్టేషన్‌లను విజిట్ చేసి పోలీసులు, అధికారులతో మాట్లాడి యోగక్షేమాలు, శాంతిభద్రతల గురించి ఆరా తీశారు. సబ్‌డివిజన్లు, పోలీసుస్టేషన్‌ల వారీగా నేరాల నమోదు, పరిశోధన, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఆయన నేరుగా బాధితులతో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులపై పనితీరుపైనా గ్రేడింగ్ చేస్తున్నారు. ఓ కేసులో వివాదాస్పదంగా మారిన మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నంపై సస్పెన్షన్ వేటు వేసిన సీపీ.. కట్టుదాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవన్న సంకేతాలు ఇచ్చారు.

శిక్షణ శిబిరం పరిశీలన

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరంగల్ జిల్లా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పరిశీలకుడు చైతన్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి యు.సుజన్‌తేజ శుక్రవారం వేర్వేరుగా పరిశీలించారు . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో బోధనా పద్ధతుల్లో మార్పులు వస్తున్నాయని, వాటిని శిక్షణలో తెలుసుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సూచించారు.


నిట్‌లో క్యాంపస్ సెలక్షన్స్

- 1,201 మందికి ఉద్యోగాలు
- రూ.64.3 లక్షల వార్షిక ప్యాకేజీతో సోమిల్ మాల్‌దానీ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్ సెలక్షన్స్ 2025లో 1,201 యూజీ, పీజీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ శుక్రవారం క్యాంపస్ సెలక్షన్స్ వివరాలు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకతను సాధించుకున్న నిట్ వరంగల్ క్యాంపస్ విద్యార్థులను ఎంపిక చేసుకునేందుకు ఈఏడాది 290కి పైగా.. కంపెనీలు పోటీ పడినట్లు తెలిపారు. నిట్‌కు చెందిన 791 మంది అండర్ గ్రాడ్యుయేట్, 717 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పూర్తిగా 1,508 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌కు హాజరుకాగా.. 1,201 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలను సాధించారని తెలిపారు. బీటెక్‌లో ఈసీఈ విభాగానికి చెందిన సోమిల్ మాల్‌దానీ అత్యధిక ప్యాకేజీ రూ.64.3 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపిక కాగా.. అత్యల్పంగా రూ.14.35 లక్షల ప్యాకేజీకి, అదే విధంగా పీజీలో రూ.12.20 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికైనట్లు తెలిపారు. గతేడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో 76 శాతం ఎంపిక కాగా.. ఈఏడాది 79.7 శాతం విద్యార్థులు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది పీహెచ్‌డీ విద్యార్థులు సైతం క్యాంపస్ సెలక్షన్లలో పోటీపడగా.. ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.9 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నిట్‌లో విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ ఎంపికకు సీసీపీడీ (సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ప్రత్యేకంగా పని చేస్తుందని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేస్తా..




మాది జైపూర్. బన్వారీ లాల్ మాల్‌ధానీ, రేణు అగర్వాల్ మా నాన్నఅమ్మ. సాధారణ మధ్య తరగతి కుటుంబం మాది. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.64.3 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యా. సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసి నా తోటి మిత్రులకు ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం.

– సోమిల్ మాల్‌దానీ, ఈసీఈ విభాగం

చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని.. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్మిక సంక్షేమ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం వివిధ కార్మిక సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు అమలు చేయాలని కోరుతూ.. 27వ తేదీన హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. 30న ఆటో కార్మికులచే ధర్నా నిర్వహించనున్నట్లు, 31న కార్మిక మాసోత్సవాల ముగింపు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్మికులకు అండగా బీఆర్‌ఎస్ నిలుస్తుందన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

సమావేశంలో కార్మిక నాయకులు నాయిని రవి, ఇంజాల మల్లేశం, ఈసంపల్లి సంజీవ, మహమూద్, ఇస్మాయిల్, తేలు సారంగపాణి, జి.నరహరి, రవీందర్‌రెడ్డి రఘుపతి రెడ్డి, రఘు, శివకుమార్, రాజారపు రాజు, శ్రీధర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ఈనెల 25న (ఆదివారం)న జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్ల పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉండాలన్నారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈపరీక్షకు ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 4,141 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. గ్రామపాలన ఆఫీసర్లు పరీక్ష హనుమకొండ సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని, ఈ పరీక్షకు 132 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.వి గణేశ్, యూపీఎస్సీ అధికారి కేశ్ రామ్ మీనా, ఏసీపీ నరిసింహారావు, ఏఓ గౌరీ శంకర్, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచాలి

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచే విధంగా బడిబాట కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న బడిబాట కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిబాటపై అవగాహన కార్యక్రమాలు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు సమన్వయంతో జూన్ 6వ తేదీనుంచి నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. పాఠశాలల విద్యా సంవత్సరం ప్రారంభంనాటికే యూనిఫామ్స్ సిద్ధంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలకు అవసరమైన వసతుల కల్పనపై ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లి ఎంఎన్‌ఆర్, ఈజీఎస్ ద్వారా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమాల నిర్వహణపై డీఈఓ వాసంతి సంబంధింత శాఖల అధికారులకు వివరించారు. జెడ్పీ సీఈఓ విద్యాలత, జిల్లా సంక్షేమాధికారి జయంతి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్లతోనే ఎరువులు విక్రయించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



ఖిలా వరంగల్ : డీలర్‌కు ఈపాస్ మిషన్ అందజేస్తున్న వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్: ఈపాస్ మిషన్లతో ఎరువులను విక్రయించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్‌లో రిటైల్ ఎరువుల వ్యాపారులకు శుక్రవారం ఎల్–1 ఈపాస్ మిషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ సత్యశారద హాజరై డీలర్లకు ఈపాస్ మిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎరువుల శాఖ ఆదేశాల మేరకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వారు ప్రస్తుతం ఉన్న ఈపాస్ మిషన్ల స్థానంలో కొత్తగా ఎల్–1 ఈపాస్ మిషన్లను డీలర్లకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈపాస్ మిషన్లతో ఎరువుల పంపిణీ పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సహాయ సంచాలకులు దామోదర్‌రెడ్డి, నర్సింగం, ఏఓ రవీందర్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ కృష్ణారెడ్డి, కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు సుజనకుమార్, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన సాగును విస్తృతం చేయాలి

న్యూశాయంపేట: రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఉద్యాన సాగును విస్తృతం చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు విస్తీర్ణంపై అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి అనురాధ, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, నాబార్డ్ ఏజీఎం రవి, కేవీకే మామునూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న పాల్గొన్నారు.

జీపీఓ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్‌లోని ఇస్లామియా జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న జీపీఓ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. జీపీఓ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పరీక్షకు 198 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ, బల్దియా హెల్త్‌ఆఫీసర్ రాజేశ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అర్షియా తబస్సుమ్, ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డ్యూటీలు తప్పవు!

ఆర్టీసీ ఉద్యోగులకు నేటి నుంచి సెలవుల్లేవ్!

- సహాయ సహకారాలు అందించాలంటూనే పని భారం

హన్మకొండ: ఉద్యోగులకు పని భారం తప్పదని టీజీఎస్ ఆర్టీసీ మరోసారి స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు, ఉత్తర్వులు లేకుండానే డబుల్ డ్యూటీలు వేస్తున్న అధికారులు.. ఇక నుంచి డబుల్ డ్యూటీలు చేయాల్సిందేనని ఉద్యోగులకు వాట్సాప్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపుతున్నారు. ఆర్టీసీలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నా.. నియామకాలు చేపట్టకుండా పని భారం మోపుతున్నట్లు ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 946 బస్సులు రోజుకు 3.76 లక్షల కిలో మీటర్లు తిరుగుతాయి. రోజుకు సగటున రూ.2.20 కోట్ల ఆదాయం వస్తుంది.

ఉద్యోగుల్లో అసహనం

'ప్రమాదాలు జరుగకండా ఉండాలంటే డ్రైవర్లు కావాల్సిన మేర విశ్రాంతి తీసుకోవాలి. మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. ప్రశాంత మనస్సుతో డ్యూటీకి రావాలి. కుటుంబ సభ్యులు కూడా విధులకు సంతోషంగా పంపాలి' అని ఊదరగొట్టే ఉపన్యాసలిచ్చే అధికారులు.. డ్యూటీల మీద డ్యూటీలు వేస్తూ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని ఉద్యోగులు, కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంతి లేకుండా సరైన నిద్ర లేకుండా ఏకాగ్రత లోపించడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారుల్లో మార్పు రావట్లేదని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. నిద్ర లేమితో బస్సు ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు ఉద్యోగులపై పని భారం మోపుతూ డ్యూటీలపై డ్యూటీలు వేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కచ్చితంగా విధులకు రావాలి: ఆర్టీసీ డీఎంలు

'మీ సహాయ సహకారాలే డిపో విజయానికి తోడ్పడుతాయి. మూడు రోజులు అన్ని రకాల సెలవులు నిలిపివేస్తున్నాం' అని డిపో మేనేజర్లు.. ఉద్యోగులకు సూచించారు. శని, ఆది, సోమ వారాల్లో బస్సులకు ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందని, ఈ రోజుల్లో వీక్లీ ఆఫ్, స్పెషల్ ఆఫ్‌లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు, ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు కచ్చితంగా విధులకు రావాల్సిందేనని, దీంతో పాటు డబుల్ డ్యూటీ చేయాల్సిందేనని డిపో మేనేజర్లు డ్రైవర్లు, కండక్టర్లకు మెసేజ్‌లు పంపుతున్నారు. దీంతో కండక్టర్లు, డ్రైవర్లు కంగారు పడుతున్నారు. తమకూ అవసరాలుంటాయని, కుటుంబానికి సంబంధించిన పనులు చూసుకోవాల్సి ఉంటుందని.. వీక్ ఆఫ్ కూడా తీసుకోకపోతే ఎలా? అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. డబుల్ డ్యూటీలతో ప్రమాదా లు జరుగుతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళ న వ్యక్తం చేశాయి. డ్రైవర్లకు తగిన విశ్రాంతి ఇవ్వాల్సిందేనని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాకేశ్ మృతదేహానికి పూర్తికాని పోస్ట్‌మార్టం

ఛత్తీస్‌గఢ్‌కు కుటుంబసభ్యులు

హసన్‌పర్తి: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన బూర రాకేశ్ పార్థివ దేహానికి పోస్ట్‌మార్టం పూర్తి కాలేదు. 27 మంది మావోల మృతదేహాల్లో శుక్రవారం సాయంత్రం వరకు ఏడుగురి పార్థివ దేహాలకు పోస్ట్‌మార్టం చేసినట్లు, ఇంకా 20 మార్చురీలోనే ఉన్నట్లు కుటుంబసభ్యులు చెప్పారు. శనివారం రాత్రి వరకు మృతదేహం ఇంటికి చేరవచ్చని పేర్కొన్నారు.

చింతగట్టులో విషాదం

రాకేశ్ మృతితో చింతగట్టులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో రాకేశ్‌మృతి సమాచారం అందుకున్న మృతుడి తండ్రి బాబుతో పాటు మరో ఇద్దరు గురువారం సాయంత్రం ఛత్తీస్‌గఢ్‌కు బయల్దేరారు. పరామర్శించేందుకు బంధువులు, మిత్రులు, వివిధ పార్టీల నాయకులు రాకేశ్ ఇంటికి వచ్చారు.

పుష్కర స్నానం.. పోటెత్తిన భక్తజనం


త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


పుణ్యస్నానం చేస్తున్న దంపతులు


పిండ ప్రదానం చేస్తున్న భక్తుడు


సరస్వతి నదికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


నీళ్లారగిస్తున్న యువతి


నదిమాతకు హారతి ఇస్తున్న యువతి


అంతర్వాహినిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం


కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం ఎదుట..


నవరత్నమాల హారతి ఇస్తున్న పండితులు


మొక్కులు చెల్లిస్తున్న యువతులు


మొక్కులు చెల్లిస్తున్న కుటుంబ సభ్యులు


పసుపు,కుంకుమ సమర్పిస్తున్న మహిళలు


అక్షర జ్ఞానాన్ని ప్రసాదించు సరస్వతి..


సరస్వతి ఘాట్ వద్ద భక్తుల సందడి


పితృదేవతలకు పిండప్రదానం చేస్తున్న భక్తులు


వర్షంలో టెంట్ కింద నిల్చున్న భక్తులు

సమ్మర్ స్పెషల్ రైళ్ల పొడిగింపు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు వేసవి ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పొడిగించినట్లు శుక్రవారం స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి–పాట్నా మధ్య రాకపోకలు సాగించే రైళ్లను పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

పొడిగించిన రైళ్ల వివరాలు..

జూన్ 4వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు చర్లపల్లి–పాట్నా (07255) వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి గురువారం కాజీపేట జంక్షన్‌కు 1:25గంటలకు చేరుకొని వెళ్తుంది. అలాగే చర్లపల్లి–పాట్నా (07256) వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 23:00 గంటలకు చేరుకొని వెళ్తుంది. అదేవిధంగా జూన్ 2వ తేదీ నుంచి జూలై 30వ తేదీ వరకు పాట్నా–చర్లపల్లి (03253) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మంగళ, గురువారాల్లో కాజీపేట జంక్షన్‌కు 23:10 గంటలకు చేరుకొని వెళ్తుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

భక్తకోటి ప్రణామం..

- పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన రద్దీ
- తొమ్మిదో రోజు రెండు లక్షల వరకు రాక


ఏకాదశి సందర్భంగా గర్భగుడిలో ద్విలింగాలకు హారతి నిర్వహిస్తున్న కాశీపండితులు

భూపాలపల్లి/కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. తొమ్మిదవ రోజు శుక్రవారం తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలనుంచికాళేశ్వరానికి సుమారు రెండు లక్షల మంది భక్తుల వరకు తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర స్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. కాళేశ్వరాలయంలో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. ఈనెల 15న ప్రారంభమైన సరస్వతి నది పుష్కరాలు 26తో ముగియనున్నాయి. మిగిలిన మూడు రోజులు శని, ఆది, సోమవారాల్లో భక్తులు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏకాదశి సందర్భంగా కాశీ పండితులతో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భగుడిలో హారతితో పాటు పూజలు నిర్వహించారు

ప్రముఖుల పూజలు..

సరస్వతినది పుష్కరాల్లో భాగంగా హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి శుక్రవారం పుష్కరిణిలో స్నానాలు చేసి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆయనకు ఆలయ అధికారులు, పండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. నర్సంపేట, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా స్నానాలు చేసి ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎస్పీలు..

అన్నారం టు పూస్కుపల్లి వరకు ట్రాఫిక్‌జాంను కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే సమీక్షించారు. పార్కింగ్ స్థలాలు, పుష్కరఘాటు, సరస్వతిఘాట్ల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఆలయంలో భక్తులకు సత్వరం దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

తొమ్మిదోరోజు నవరత్నమాల హారతి..

కాశీపండితులతో తొమ్మిది రోజులుగా వైభవోపేతంగా నిర్వహిస్తున్న నవరత్నమాల హారతి శుక్రవారం రాత్రి సరస్వతిఘాటు వద్ద ఘనంగా నిర్వహించారు. హారతి సమయంలో మళ్లీ వర్షం కురిసింది.

పుష్కర 'కష్టాలు'

- ట్రాఫిక్‌తో భక్తులకు తప్పని తిప్పలు
- ఐదు కిలోమీటర్ల నుంచి కాలినడకన భక్తులు
- స్పెషల్ సర్వీసుల కోసం ఎదురుచూపులు
- బురదలో కూరుకుపోయిన వాహనాలు

భూపాలపల్లి అర్బన్ : కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలకు వస్తున్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ట్రాఫిక్ సమస్య నివారణకు పోలీసులు రెండ్రోజుల క్రితం వన్ వే ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం వన్ వేలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాళేశ్వరం నుంచి మద్దులపల్లి వరకు ఏడు కిలోమీటర్ల మేర ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. పుసుకుపల్లి సమీపంలోని ఇసుక డంపింగ్ యార్డులో పోలీసులు హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రైవేట్ వాహనాలు నిలిపి వేశారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్లు కాలినడకన సరస్వతి ఘాట్‌కు పిల్లలు, వృద్ధులు నడుచుకుంటూ వెళ్లారు. పోలీసులు ప్రత్యేక స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి కొందరిని తరలించారు. కొందరు భక్తులు తమ వాహనాలు పంపించాలని పోలీసులతో గొడవకు దిగారు.


హోల్డింగ్ పాయింట్‌లో నిలిచిన వాహనాలు

హోల్డింగ్ పాయింట్‌లో కూరుకుపోయిన వాహనాలు

పుసుకుపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్‌కి ప్రైవేట్ వాహనాలను మళ్లించారు. అకాల వర్షం కారణంగా భూమి పూర్తిగా మెత్తబడడంతో కార్లు, ఆటోలు అందులో కూరుకుపోయాయి. దీంతో పోలీసులు బస్సులను రప్పించి భక్తులను త్రివేణి సంగమానికి తరలించారు. అడవిలో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి తాగే సౌకర్యం లేదు.


కూరుకుపోయిన వాహనాలను బయటికి తీస్తున్న భక్తులు

కాలినడకన ఘాట్‌కు భక్తులు

మద్దులపల్లి వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ఆర్టీసీ బస్సులో వచ్చిన భక్తులు, పుసుకుపల్లి వద్ద ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్ నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు ఐదు కిలోమీటర్ల మేరకు పంటపొలాలు, బీడు భూముల మీదుగా గోదావరి తీరానికి నడుచుకుంటూ వెళ్లారు.


వాహనాలను మళ్లిస్తున్న కాటారం డీఎస్పీ


పొలాల్లోంచి నడుచుకుంటూ వస్తున్న భక్తులు


పుసుకుపల్లి రోడ్డులో ట్రాఫిక్‌జామ్

రైతు ర్యాలీకి అనుమతిని పరిశీలించండి

- వరంగల్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27న రైతు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణ కోసం తెలంగాణ రైతు సంఘం పెట్టుకున్న దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని వరంగల్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. శాంతియుత ర్యాలీ, సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వరంగల్‌లోని కార్మిక మైదానంనుంచి సాయి కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో 800 మంది రైతులు పాల్గొనే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆజంజాహీ మిల్లు మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనిపై పలుమార్లు దరఖాస్తు చేసినా పోలీసులు ఎలాంటి నిర్ణయమూ చెప్పలేదు. అందుకే విధిలేక కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది' అని చెప్పారు. మరోవైపు కలెక్టర్ నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) ఉంటే తప్ప ర్యాలీకి అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ సమర్పించిన తర్వాత మే 17న సమర్పించిన ఆన్‌లైన్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని అనుమతిని పరిశీలించాలని పోలీసులను ఆదేశించారు. చట్టప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి


బస్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకలో జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్, కల్వర్టు పనులను కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అలాగే వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను, పరిసరాలను పరిశీలించి వర్షాకాలం సమీపిస్తుండటంతో పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

ముగ్గురిపై గృహ హింస కేసు

మహబూబాబాద్ రూరల్: ఓ వివాహితను అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై గృహహింస చట్టం కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీటీఆర్ నగర్ కాలనీ చెందిన దుంప స్వప్నకు ఖమ్మం జిల్లా కేంద్రం శివారులోని మారెమ్మ గుడి ప్రాంతానికి చెందిన వంశీతో ఏడాది క్రితం వివాహం జరిగింది. పెళ్లి జరిగిన సమయంలో రూ.3లక్షలు కట్నంగా ఇచ్చారు. డబ్బులు సరిపోవటం లేదంటూ మరో రూ.5లక్షలు తేవాలంటూ స్వప్నను వంశీ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈక్రమంలో ఆమె భర్త వంశీ, అత్తమామలు వెంకన్న అలివేలుపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై అలీంహుస్సేన్ కేసు నమోదు చేశారు.

ట్రాలీ అడుగును అరలుగా మార్చి..

- 400 కిలోమీటర్లు.. 105 గంజాయి ప్యాకెట్లు
- 210 కిలోల 760 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదులు


పారిపోబోయిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి, వరంగల్ : ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అడవి అన్నవరం గ్రామం నుంచి హైదరాబాద్‌కు ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో అరలుగా(చిన్నపాటి గదుల్లా) తయారుచేసి అందులో నిషేధిత ఎండు గంజాయి ప్యాకెట్లని తరలిస్తున్న నలుగురు నిందితులను వరంగల్ యాంటి నార్కొటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1908 ద్వారా వచ్చిన విశ్వసనీయ సమాచారంతో డీఎస్పీ కె.సైదులు, ఇన్‌స్పెక్టర్ రవీందర్ నేతృత్వంలో 17 మంది సభ్యుల బృందం వరంగల్ ఉర్సుగుట్ట జంక్షన్‌లో నిఘా పెట్టి ముందు ఎస్కార్ట్‌గా వస్తున్న స్విఫ్ట్ కారుతో పాటు గంజాయితో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపారు. తనిఖీ చేస్తే రూ.1,05,38,000ల విలువ చేసే 210 కిలోల 760 గ్రాములు (105 ప్యాకెట్లు) దొరికాయి. నలుగురు నిందితుల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ములుగురోడ్డులోని వరంగల్ యాంటీ నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కె.సైదులు మీడియాకు శుక్రవారం వివరాలు వెల్లడించారు.

రూ.పది వేలకు ఆశపడి..
400 కిలోమీటర్లకు పైగా నడిపి..

ఏపీలోని అడవి అన్నవరానికి చెందిన తల్లిబాబు, నర్సీపట్నానికి చెందిన గోవిందమ్మ గంజాయి రవాణా చేస్తుంటారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం తండాకు చెందిన గుగులోత్ భాస్కర్, కంబాలపల్లి గ్రామం పూరి తండాకు చెందిన కొర్ర వినోద్ కుమార్‌కు తల్లిబాబుతో పరిచయం ఏర్పడింది. అప్పటికే నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగేడు గ్రామానికి చెందిన కేతావత్ రాము నాయక్‌కు గుగులోతు భాస్కర్ పరిచయం ఉండడంతో ఈ గంజాయి అక్రమ రవాణాకు ప్లాన్ వేశారు. ఇందుకోసం రాము నాయక్ నెలన్నర క్రితం రూ1.60 లక్షలకు ఓ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. కిలో గంజాయి రూ.3,500లకు తల్లిబాబు, గోవిందమ్మ వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని శ్రీకాంత్‌కు కిలోకు రూ.పదివేల చొప్పున అమ్మేందుకు ట్రాక్టర్ ట్రాలీ కింది భాగాన అరలుగా తయారుచేసి 105 ప్యాకెట్లను అమర్చి మూడ్రోజుల క్రితం అన్నవరం నుంచి బయలుదేరాడు. అయితే ఈ లోడ్‌ను హైదరాబాద్‌కు చేరవేస్తే రూ.10వేలు ఇస్తామని చెప్పడంతో అనకాపల్లి జిల్లా నీతవరం వలసంపేటకు చెందిన విరోధుల శీను ట్రాక్టర్ డ్రైవర్‌గా ఒప్పుకున్నాడు. సుమారు 400 కిలోమీటర్లకుపైగా ప్రయాణించిన ట్రాక్టర్‌లో ఏమీ లేకపోవడంతో ఎక్కడా చెక్ పోస్టుల వద్ద పోలీసులకు అనుమానం రాలేదు. ఈ ట్రాక్టర్‌కు ముందు భాస్కర్ స్నేహితుడి కారు పైలటింగ్ ఉపయోగించారు. టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం రావడంతో అప్రమత్తమైన వరంగల్ నార్కొటిక్ పోలీసులు ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద భాస్కర్, రాము, వినోద్ కుమార్, విరోధుల శ్రీనును అరెస్టు చేశారు. వీరిని పట్టుకోవడంతో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సైలు శ్రీ కాంత్, రాజు, మొగిలి, హెడ్‌కానిస్టేబుళ్లు రంగయ్య, నిరంజన్, సోమలింగం, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఏ.రాజు, కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, ఎం.రాజేష్, పి.విజయ్, రహీం, కుమారస్వామి, సంపత్, సతీష్, సునీల్‌లను డీఎస్పీ సైదులు అభినందించారు. అయితే ఈ మీడియా సమావేశానికి ప్రధాన నిందితుడు భాస్కర్‌ను తీసుకొస్తుండగా పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంటనే అతడిని లోపలికి తీసుకెళ్లారు.

అప్పు అడిగినందుకు అంతమొందించారు

- భద్రు హత్య కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సూర్యప్రకాశ్

గూడూరు : తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.సూర్యప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని గుండెంగ శివారు పంతుల్యా తండాకు చెందిన తేజావత్ భద్రు హత్య కేసు వివరాలను సీఐ వివరించారు. పంతుల్యాతండాకు చెందిన భద్రు మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య నీల బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం తండా సమీపంలోని వ్యవసాయ బావిలో భద్రు శవమై కనిపించగా, పోలీసులు హత్యకేసుగా నమోదు చేశారు. కానీ అంతకు ముందే పంతుల్యా తండాకు చెందిన తేజావత్ వీరేందర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనతో పాటు మరో ముగ్గురు తేజావత్ భద్రును చంపినట్లు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వెంటనే విచారణ చేపట్టగా, భద్రు వద్ద రూ.50 వేలు అప్పు తీసుకున్న వీరేందర్ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అదే తండాకు చెందిన తేజావత్ సురేష్‌కు చెప్పుకున్నాడు. గతంలో భద్రుపై కోపంతో ఉన్న సురేష్, వీరేందర్‌తో కలిసి పథకం పన్నారు. ఈక్రమంలో అదే తండాకు చెందిన తేజావత్ కిషన్, బాదావత్ ఈర్య వారికి సహకరించగా, మద్యం తాగిఉన్న భద్రు మెడకు టవల్ చుట్టి ఊపిరాడకుండా చేసి చంపామని, అనంతరం సమీపంలోని వ్యవసాయ బావిలో వేశామని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణ అనంతరం హత్యకు పాల్పడిన తేజావత్ వీరేందర్, తేజావత్ కిషన్, తేజావత్ సురేష్, బాదావత్ ఈర్యలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సూర్యప్రకాశ్ తెలిపారు. గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి, కొత్తగూడ ఎస్సై కుషకుమార్, ట్రెయినీ ఎస్సై కోటేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

జనగామ రూరల్ : హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి సుచరిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాచరాజు హరిచంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌కు చెందిన బొమ్మకంటి మల్లేశం తమపై హత్యాయత్నం చేశాడని 2017లో సాధన అరుణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి తల్లిదండ్రులపై నిందితుడు బొమ్మకంటి మల్లేశం చికెన్ కట్ చేసే కత్తితో గాయపరచడంతో అప్పటి ఎస్సై రాజన్ బాబు కేసు నమోదు చేశాడు. కానిస్టేబుల్ వంశీ సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా సబ్ జడ్జి సుచరిత నిందితుడికి శిక్షతోపాటు జరిమానా విధించారు.